క్లుప్తంగా

ఓంశక్తి ఆలయంలో పూజలు

నింద్ర: మండలంలోని నింద్ర గ్రామంలో ఉన్న ఓంశక్తి ఆలయంలో ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అదే విధంగా ఎలకాటూరు గ్రామంలో ఉన్న గ్రామ దేవతల పోలాక్షమ్మ ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శరవేగంగా కాలువ పనులు



నిర్మాణంలో ఉన్న కాలువ

నగరి: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు భీమా నగర్‌లో తీరని సమస్యగా ఉన్న మురుగు కాలువ సమస్య మంత్రి ఆర్‌కే రోజా చొరవతో పరిష్కారమైంది. కాలువ నిర్మాణం చకచకా జరుగుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజాకు స్థానికులు సమస్యను తెలపడంతో రూ.20 లక్షల నిధులతో కాలువ, రోడ్డు పనులు జరుగుతున్నాయి. 450 మీటర్లు నిర్మించాల్సిన కాలువలో ఇప్పటికే 160 మీటర్లు పూర్తి కాగా మిగిలిన నిర్మాణ పనులు జరుగుతోంది.

22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(అలిపిరి): శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 22వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఆలయంలో 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. 22న తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారని తెలిపారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి రూరల్: వేధిస్తున్న అనారోగ్యానికి తోడు సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం తిరుపతి ఎస్వీ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ తెలిపిన వివరాల మేరకు... వెదురుకుప్పం మండలం తిరుమలయ్యగారి పంచాయతీకి చెందిన టి.శశి(16) తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. బాలికకు ముందు నుంచే గ్యాస్ట్రిక్ సమస్య ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు రెండు రోజుల క్రితం వచ్చాయి. ఇందులో ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెందిన శశి ఆదివారం కళాశాల వసతి గృహంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గమనించిన రూమ్‌మేట్ ప్రవల్లిక హాస్టల్ కేర్‌టేకర్‌కు సమాచారం అందించారు. హాస్టల్ సిబ్బంది వచ్చేసరికే శశి మృతి చెందింది. శశి తల్లి మమత ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ సీఐ తమీమ్ అహ్మద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తమీమ్ అహ్మద్ తెలిపారు.

ఇంటెలిజెన్స్‌లోనూ డేటా సైన్స్‌దే ప్రధాన పాత్ర

తిరుపతి సిటీ: పోలీస్ ఇంటెలిజెన్స్ విభాగంలోనూ డేటా సైన్స్ ప్రధాన పాత్ర వహిస్తోందని విజయవాడ ఇంటెలిజెన్స్ ఎస్పీ యూ.రామ మోహన్ తెలిపారు. ఆదివారం మహిళా వర్సిటీలో ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్(ఐఎస్‌పీఎస్), ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగం పూర్వ విద్యార్థులు, మహిళా వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో గణాంకాలు–డేటా సైన్స్‌లో పురోగతి అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ తాను స్టాటిస్టిక్స్ విద్యార్థినేనని, డేటా సైన్స్‌లో స్టాటిస్టిక్స్ పాత్ర ప్రముఖ మైందన్నారు. రానున్న రోజుల్లో ప్రధాన భూమికి పోషిస్తుందని చెప్పా రు. స్టాటిస్టిక్స్ కాన్సెప్ట్, డేటా సైన్స్ అల్గారిథమ్స్ మధ్య ఉన్న ఇంటర్నల్ సారూప్యతను ఆయన వివరించారు. అనంతరం 2022, 23వ బ్యాచ్‌కు చెందిన ఎస్వీయూ ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ విభాగంలో ప్రతిభ చూపి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులు జాహ్నవి, ప్రియాంకకు ఆయన గోల్డ్‌మెడల్స్ అందించారు. ఐఎస్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పి. రాజశేఖర్‌రెడ్డి, స్విమ్స్ సైన్స్ విభాగం డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, ప్రొఫెసర్ ఎస్ఆర్. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శివపార్వతి, డాక్టర్ ఆర్ విష్ణువర్ధన్, పి.వెంకటేశన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి.. వచ్చేనా దిగుబడి?

- లేటుగా వస్తున్న పూత
- ముమ్మరంగా సస్యరక్షణ చర్యలు
- పర్యవేక్షిస్తున్న ఉద్యానవన అధికారులు
- దిగుబడిపై రైతన్న ఆందోళన



కేబీఆర్‌పురంలో కొద్దిపాటి పూతతో కనిపిస్తున్న మామిడి తోట



చెర్లోపల్లిలో మామిడితోటకు మందులు పిచికారీ చేస్తున్న రైతులు

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రధాన వాణిజ్య పంట మామిడి. సుమారు లక్షన్నర ఎకరాల్లో సాగవుతోంది. ఏటా జనవరిలో పూత వికసించి పక్వానికి రావడం ఆనవాయితీ. ఈఏడాది జనవరిలో పూత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. దీనిపై ఉద్యానవన శాఖ అధికారులు తోటల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టారు. డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాల కారణంగా తోటల్లో నేటికీ తేమశాతం ఉన్న కారణంగానే పూత రాలేదని నిర్ధారించారు. పూత రావడానికి సస్యరక్షణపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. అధికారుల సూచనల మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో ఫిబ్రవరి రెండవ వారం నుంచి పూత రావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఒకటి, అర తోటల్లో 60 శాతం పూత కనిపిస్తున్నా చాలావరకు బెంగళూరు రకం తోటల్లో 30 నుంచి 40 శాతం మాత్రమే పూత రాగా, చందూర తోటల్లో 20 శాతానికి మించలేదు. పూర్తిస్థాయిలో పూత రావాల్సి ఉంది. ఆలస్యంగా వస్తున్న పూత సైతం ఏమేరకు నిలబడి పిందె కడుతుందో అనే అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి. ఈ దశలోనూ మామిడి రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తగిన జగ్రత్తలు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

సస్యరక్షణ తప్పనిసరి..



మామిడి చెట్లకు పూత పుష్కలంగా రావడానికి పొటాషియం నైట్రేట్ 10 నుంచి 15 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి, 10 గ్రాముల యూరియా, ఫార్ములా–4 సూక్ష్మకాలు 5 గ్రాములు ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. లేత పూత దశలో తేనె మంచు పురుగు, పేను బంక సమస్య ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ఇమిడాక్లోపిడ్ 0.5 మి.లీ.లీటరు నీటితో కలిపి పూత తడిచేలా పిచికారీ చేయాలి. పిందె ఏర్పడిన తర్వాత మచ్చ తెగులు, తామర పురుగుల సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఈ దశలో పిందె రాలకుండా ఉండడానికి ప్లానోటిక్స్ 1 మి.లీ. మందును 4.5 లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. పైసూచనలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి రావచ్చు.

– వెంకటసౌజన్య, ఉద్యానవన శాఖ అధికారి, పుత్తూరు

సూచనలు పాటిస్తున్నాం



ఉద్యానవనశాఖ అధికారుల పర్యవేక్షణ బాగుంది. వారి సలహాలు, సూచనలు పాటిస్తున్నాం. తూర్పు మండలాల్లో మామిడి తోటలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా రైతులకు మామిడి రైతులకు క్రిమిసంహారక మందులు, స్ప్రేయర్లు, ట్రేలు, టార్పాలిలన్ పట్టలు, పీవీసీ పైపులను సైతం సబ్సిడీ కింద ఇచ్చి, చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహించాలి. ఇందుకు ఆర్‌బీకేలను కేంద్రంగా చేసుకొని సరఫరా చేయాలి.

– టి.కేశవులు, అధ్యక్షుడు, కేబీఆర్‌పురం మామిడి రైతు సొసైటీ, పుత్తూరు మండలం

దిగుబడిపై ఆశతో ఉన్నాం..



ఈఏడు మామిడి దిగుబడిపై ఆశతోనే ఉన్నాం. పూత ఆలస్యంగా వస్తోంది. సస్యరక్షణ పనులు చేపడుతున్నాంము. కొంత దిగుబడి తగ్గినా, గత ఏడాదికన్నా మెరుగైన ఫలితం వస్తుందని ఆశిస్తున్నాం. 90 శాతం సబ్సిడీతో అందించిన డ్రిప్, అన్‌డ్రిప్ పరికరాల సరఫరాను కొనసాగించాలి. ధరల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని, రైతుకు గిట్టుబాట ధర కల్పించాలి.

– ఎస్.లక్ష్మీపతి, రైతు, చెర్లోపల్లి, పుత్తూరు మండలం

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి నారాయణ స్వామివారి కల్యాణోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం లక్ష్మీనారాయణ స్వామివారికి సుప్రభాతం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులు అయిన శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక అలంకరణలతో వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని భక్తులు కనులవిందుగా వీక్షించారు. కార్యక్రమంలో చిత్తూరు నగరానికి చెందిన సింధుప్రియ, కీర్తి ఉభయదారులుగా వ్యవహరించగా, అనంతరం ఆలయ మర్యాద ప్రకారం ఉభయదారులకు పట్టువస్త్రాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్ల వెంకటేషులు రెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలోని చర్చి వద్ద సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు ఉచిత కంటి వైద్యశిబిరం జరుగుతుందని సీఎస్ఐ చర్చి పాస్టర్ దేవేంద్రన్, సభామణియం జీవరత్నం తెలిపారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ఎంఎస్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో తూగుండ్రం సీఎస్ఐ చర్చి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు వారు తెలిపారు. గతంలో కంటి ఆపరేషన్ చేసుకున్న రోగులు సైతం తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

వృద్ధులకు చీరల వితరణ



వృద్ధులకు చీరలు, పంచెలు వితరణ చేస్తున్న మునిప్రసాద్

కార్వేటినగరం: మండలకేంద్రం కార్వేటినగరంలోని మండపం వీధికి చెందిన శ్రీనివాసులు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మునిప్రసాద్, లక్ష్మీ దంపతులు ఆదివారం రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని 32 మంది వృద్ధులకు చీరలు, పంచెలు, టవళ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత మునిప్రసాద్ మాట్లాడుతూ అనాథ ఆశ్రమాల్లో ఉన్న వృద్ధులను అక్కున చేర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అన్నదానంతో పాటు పండ్లు, స్వీట్లు, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో మధు, బాలకృష్ణ, గురుస్వామి, పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

28న బంగారుపాళెంలో వాలీబాల్ టోర్నమెంట్

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెం దళితవాడలో ఈ నెల 28న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గుంతూరు రోడ్డు పక్కన ఉన్న సీఎస్ పురం సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో పోటీలు ప్రారంభమవుతాయ న్నారు. టోర్నీలో పాల్గొనదలచిన జట్లు రూ.555 ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10,116, రెండో బహుమతిగా రూ.7,116, మూడో బహుమతిగా రూ.5,116, నాలుగో బహుమతిగా రూ.3,516 అందజేస్తామని పేర్కొన్నా రు. వివరాలకు 9347166929, 9160718768 సంప్రదించాలని కోరారు.

నేడు మొగిలి శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం : మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహు కేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈవో మునిరాజు తెలిపారు. రాహు కాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

ఘనంగా మధ్వాచార్యుల జయంతి



మధ్వాచార్యుల పూజకు సామగ్రి అందజేస్తున్న ఈవో వెంకటేశు

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం ద్వైతమతం మధ్వాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి కల్యాణ వేదికలో మధ్వాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. జీవుడు, దేవుడు వేర్వేరని, జీవ, పరమాత్మ రెండుగా ఉంటాయని చెప్పే ద్వైతమతాన్ని మధ్వాచార్యులు నెలకొల్పారని వేదపండితులు వివరించారు. ఆయనను వాసుదేవుడి అంశగా భావిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటేశు, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

గీతామకరంద గుళికలు గ్రంథం ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో రాస్ భవన్‌లో ఆదివారం డాక్టర్ గుడివాడ అన్నయ్య నాయుడు తెలుగులోకి అనువదించిన గీతామకరంద గుళికలు(శ్రీమద్భగవద్గీత) గ్రంథ ఆవిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహస్రవధాని డాక్టర్ మేడసాని మోహన్ పాల్గొని గీతామకరంద గుళికలు గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ గోవిందస్వామి నాయుడు గ్రంథ పరిచయం చేయగా, మేడసాని గ్రంథ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత ఆచార్య మధురాంతకం నరేంద్ర తన గురువైన అన్నయ్య నాయుడుతో తన మధుర జ్ఞాపకాలు గుర్తు చేశారు. భగవద్గీత శ్లోకాలను తేట గీత పద్యాలు, భావాలు అందించిన అన్నమయ్య నాయుడిని పలువురు వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, సాహితీ వేత్తలు డాక్టర్ మాలేపాటి పురుషోత్తమాచారి, డాక్టర్ నెమలేటి కిట్టన్న, ఏనుగు అంకమ నాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ మన్నవ గంగాధర్ ప్రసాద్, గొడుగు చింత గోవిందయ్య, మూరిశెట్టి గోవిందు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మేడసాని మోహన్

ప్రాంతీయ పరిమళాలు వెదజల్లే 'మేకల బండ'



మేకల బండ నవల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: పాత చిత్తూరు జిల్లా ప్రాంతీయ పరిమళాలు వెదజల్లే నవల మేకల బండ అని వక్తలు కొనియాడారు. మూగజీవాల నేపథ్యంతో రాసిన ఈ నవల తాత్విక చింతనతో కూడుకున్నదిగా అభివర్ణించారు. తిరుపతి రచయిత ఆర్‌సీ. కృష్ణస్వామి రాజు రచించిన మేకల బండ నవల ఆవిష్కరణ సభ ఆదివారం సాయంత్రం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగింది. శ్వేత డైరెక్టర్ భూమన్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్వీ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆర్.రాజేశ్వరమ్మ పుస్తక సమీక్ష చేశారు. ఆమె మాట్లాడుతూ మనిషిలాగే మూగజీవాలకు ఆలోచనా శక్తి వస్తే అవి కూడా సంకుచిత జాడ్యాలకు గురి అవుతాయని రచయిత తెలియజేశారన్నారు. వ్యంగ్య రూపంలో ప్రస్తుత సమాజం తీరుతెన్నులను, వివిధ పాత్రల ద్వారా చురకలు అంటించారని తెలిపారు. మూగజీవాలకు కూడా స్పందించే గుణం ఉందని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనమీద ఉందని తెలిపారు. సహజ వాతావరణాన్ని మనిషి కలుషితం చేయడం ద్వారా జీవాలకు సైతం కృత్రిమ గర్భధారణ పద్ధతుల అవసరం వస్తోందని రచయిత ఆవేదన ఆలోచింపదగిందని తెలిపారు. వెటర్నరీ వర్సిటీ ప్రొఫెసర్ ఆర్‌వీ.సురేష్ కుమార్ మాట్లాడుతూ సజీవమైన భాషా శైలి ఈ నవలలో ఉందని, పుత్తూరు ప్రాంత స్వరం పలుకుతోందని కొనియాడారు. సాహితీ ప్రియులు డాక్టర్ మన్నవ గంగాధర్‌ప్రసాద్, మల్లారపు నాగార్జున, కందారపు మురళి, సుధాకర్‌రెడ్డి, పేరూరు బాలసుబ్రమణ్యం, టెంకాయల దామోదరం, ఏ.కృష్ణమ నాయుడు, పలువురు రచయితలు పాల్గొన్నారు.

నగరి సిగలో మరో పర్యాటకం



నగరిలో శిల్పారామం ఏర్పాటు కానున్న ప్రాంతం

- మంత్రి ఆర్‌కే రోజా చొరవతో మంజూరైన శిల్పారామం
- మండలంలోని తడుకు వద్ద పూర్తయిన భూసేకరణ
- నియోజకవర్గ ప్రమాణాలు పెంచుతున్న ప్రభుత్వం

నగరి: నగరికి పర్యాటక సింగారం చేకూరనుంది. ఇప్పటికే ప్రమాణాలు పెంచుకుంటూ అభివృద్ధి పథకంలో నడుస్తున్న నగరి నియోజకవర్గానికి 'శిల్పారామం' రూపంలో అదనపు అందం చేకూరనుంది. పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా సూచనల మేరకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఏపీ శిల్పారామం సొసైటీ, విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్‌కు అందిన లేఖ అందడంతో ఆయన భూముల కేటాయించేందుకు భూసేకరణ చేయాలంటూ ఆర్డీఓకు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు నగరి మండలం తడుకు గ్రామంలోని సర్వే నంబరు 92/1, 2, 93/3, 94/2,3, 95/3,4 లోని 12 ఎకరాల స్థలాన్ని 'శిల్పారామం' ఏర్పాటుకు కేటాయించారు. భూముల కేటాయింపు పూర్తికావడంతో ఏపీ శిల్పారామం సొసైటీ వారు త్వరగా నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 8 శిల్పారామాలు ఉండగా కొత్తగా ఐదు శిల్పారామంను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇలా నగరిలో ఒక శిల్పారామం ఏర్పాటు కానుంది. ఇప్పటికే నియోజకవర్గంలో నాలుగు పార్కులు ఏర్పాటైన విషయం విదితమే. ఇవి స్థానికులకు ఆహ్లాదాన్ని పంచుతుండగా నూతనంగా ఏర్పాటు కానున్న శిల్పారామం పర్యాటక సింగారాన్ని చేకూర్చనుంది. మన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధిత కళాఖండాలు, శిలల పార్కు, పచ్చికబయళ్లు, తోటలు, రాక్ గార్డెన్, కలంకారీ వస్తువులు, బోటింగ్, పార్కు, చేనేత దుస్తులు, పింగాణి వస్తువుల అమ్మకాలు, పురాతన వస్తువుల ప్రదర్శన అంటూ శిల్పారామం నగరి ప్రజలను అలరించనుంది. చేతివృత్తి ద్వారా వస్తువులు తయారు చేసే వారికి శిల్పారామం వరప్రదాయని కానుంది.

స్థాయి తెలుసుకుని మాట్లాడు థామస్

- గంగాధర నెల్లూరు వైస్ ఎంపీపీ హరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గంగాధర నెల్లూరు: వార్డు మెంబర్‌గా కూడా రాజకీయ అనుభవం లేని థామస్ 40 ఏళ్ల అనుభవం గల డిప్యూటీ సీఎం నారాయణస్వామిని విమర్శించడం తగదని మండల వైస్ ఎంపీపీ హరిబాబు మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ థామస్ గత కొద్దిరోజులుగా తనస్థాయి మరిచిపోయి మాట్లాడుతున్నాడని, నియోజకవర్గ ముద్దుబిడ్డ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఏకవచనంతో మాట్లాడుతూ తీవ్రమైన పరుష పదజాలంతో దుర్భాలాడుతున్నాడని, కేవలం డబ్బు, మందు ఎరగా వేసి రాజకీయ పబ్బం గడుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, సాధారణ కార్యకర్తలను కూడా నాయకులు చేసిన ఏకైక నాయకుడు నారాయణస్వామి అని అనవసరంగా విమర్శిస్తే ఊరుకునేది లేదని అన్నారు. సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలకు నారాయణస్వామి కృషి చేస్తున్నారని, ఎన్నికలకు దూరంలో వచ్చి డబ్బు మందుతో ప్రజలను కొనలేరని, రానున్న ఎన్నికల్లో ప్రజలే థామస్‌కు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మరోసారి నారాయణస్వామిని ఏకవచనంతో మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి జగదీష్‌బాబు, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలిన నాయకులు



నింద్ర నుంచి బయలుదేరిన నాయకులు

నింద్ర: మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం అనంతపురంలో రాప్తాడు జరిగే జగనన్న సిద్ధం సభకు బయలుదేరి వెళ్లారు. మండలం నుంచి ఐదు బస్సుల్లో నాయకులు తరలివెళ్లారు. మండలంలోని ఎంపీపీ దీప, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్ ఆధ్వర్యంలో నాయకులు వెళ్లారు. ఆరూరు, కొప్పేడు, అత్తూరు, అగరం గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు వెళ్లిన వారిలో ఉన్నారు.

కార్మిక చట్టాలను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు గంగరాజు

పుత్తూరు: కార్మిక చట్టాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గంగరాజు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మికల చట్టాలను కాలరాసి, కార్మిక జీవితాలతో ఆటలాడుతోందని ఆరోపించారు. యాజమాన్యాలకు అనుకూలంగా 4 కోడ్‌లను తీసుకురావడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందన్నారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేష్, లక్ష్మీ, నరసమ్మ, ధనకోటి, మమత తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నిత్యభజనలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్

కాణిపాకం(యాదమరి) : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిత్య భజనలు నిర్వహించాలని పలువురు కళాకారులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం అగరంపల్లె ఆర్చి నుంచి భజన చేస్తూ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామి వారి ఆస్థాన మండపంలో సమావేశమయ్యారు. కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి మాట్లాడారు. స్వామి నిత్యనామ సంకీర్తన ఆలపించాలన్న కళాకారుల కోరికను యాజమాన్యం ఆమోదించాలన్నారు. ఇందులో భాగంగా వెంటనే వేదికను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆలయ ఏఈఓ హరిమాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు మురళి, కమిటీ సభ్యులు నాగరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రామచంద్రన్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి రాజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

పుంగనూరు: మండలంలోని ఇటుకనెల్లూరులో అగ్నిప్రమాదం చోటుచేసుకుని చెట్లు కాలిపోయాయి. వివరాలు.. నాగరాజుకు చెందిన మామిడితోట, నీలగిరితోటలో ఆదివారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఎవరో ధూమపానం చేసి బీడీ లేదా సిగరెట్ ముక్క ఆర్పకుండా పడేయడం, దానికితోడు ఎండ తీవ్రత ఎక్కువ ఉండడం వల్ల మంటలు రేగినట్లు తెలుస్తోంది. సమాచారం అందడంతో అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు తన సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ప్రమాదంలో రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.